ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

జూన్ 2015

₹10



ఎందరో మహానుభావులు అందరికీ వందనములు

ఆధ్యాత్మిక అమృతవాహిని

# శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 6 జూన్ 2015



**సత్యాన్న ప్రమదితవ్యమ్, ధర్మాన్న ప్రమదితవ్యమ్,**
**కుశలాన్న ప్రమదితవ్యమ్, భూత్యై న ప్రమదితవ్యమ్,**
**స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్,**
**దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్,**
**మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ॥**

సత్యమార్గం నుండి మరలకుము, ధర్మమార్గం నుండి మరలకుము, ఆత్మసంరక్షణ నుండి మరలకుము, స్వాధ్యాయ ప్రవచనాల నుండి మరలకుము, దేవ పితృ కర్మల నుండి మరలకుము. తల్లీ, తండ్రీ, గురువూ, అతిథులనూ దైవసమానులుగా తలచి పూజింపుము.

*(అధ్యయనానంతరం గురువు శిష్యునికి చేసిన బోధ – 'తైత్తిరీయోపనిషత్తు')*

## సూక్తి సౌరభం

**అంజలిస్థాని పుష్పాణి**
**వాసయన్తి కరద్వయమ్ ।**
**అహో! సుమనసాం ప్రీతిః**
**వామ దక్షిణయోస్సమమ్ ॥**

"దోసిలిలోని పూల వల్ల సువాసన రెండు చేతులకు సమానంగా అంటుకుంటుంది. ఆ పరిమళానికి కుడిచేయి, ఎడమచేయి అనే భేదం లేదు. అలాగే, మంచి మనసున్నవారు కూడా అందరినీ సమభావంతో ఆదరిస్తారు."

**కడుపు చిచ్చు చేత, కామానలము చేత**
**క్రోధ వహ్ని చేత కుతిలపడక, యుక్త**
**మనసుతోడ నుండును - సుజనుడు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

"ఓ వేమా! జఠరాగ్ని – పొట్టను; కామాగ్ని – దేహాన్ని; క్రోధాగ్ని – మనస్సుని కాల్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ సజ్జనుడు ఆ త్రితాపాలకు చలించడు."

# లోపలి పేజీల్లో...


6 సంపాదకీయం
భువిలో వెలసిన త్రిమూర్తులు

8 గోరుముద్ద
ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

9 రామకృష్ణ భక్తి సూత్రాలు

10 పలికెడిది భాగవతం
మహర్షిని పరీక్షిత్తు పరాభవించి...

12 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

14 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

15 నీ కథామృతము నిరత సేవన నాకు

16 పరమపదానికి రాజమార్గం

18 దేహస్పృహలేని మౌనధ్యాని

20 పరిప్రశ్న

21 ధీరవాణి
ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణే విద్య

22 మహిమలు ముక్తినిస్తాయా?

24 కత్తి మీద సాము!

26 లక్ష్యాన్ని ఛేదిద్దాం!

27 కనులు లేవని కలత లేదు

28 అతిథి దేవో భవ!

30 సంగీత సాంత్వన!

31 నిశ్చల స్వభావం

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
'రామ'చిలుక బోధ

36 భగవద్గీత – సద్గుణ సుధ
ఫలితం పరమాత్ముని అధీనం!

37 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
దేహ ధర్మం! / పక్కనే ఉండాల్సినవారు!

38 బొమ్మల కథ
అసమాన సేవాతత్పరుడు

41 వికాస మంత్రాలు


ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

## శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్


KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128




# భువిలో వెలసిన త్రిమూర్తులు

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరమూ ఆనందంగా జీవించాలనే ఆశిస్తాం. ఆనందంగా జీవించాలంటే మన కనీస అవసరాలు తీరాలి, సౌకర్యాలు సమకూరాలి. అందుకు సంపాదన అవసరం; సంపాదించాలంటే ఉపాధి అవసరం; ఉపాధి కావాలంటే విద్య అవసరం. అయితే, ఉన్నత విద్యావంతులై ఉన్నత పదవులను నిర్వహిస్తూ, ధనసంపాదన చేస్తున్నవారంతా ఆనందంగా జీవించగలుగుతున్నారా? అని ఆలోచిస్తే ఈ ప్రశ్నకు సమాధానం మనందరికీ తెలిసిందే!

మనిషి ఆనందంగా జీవించడానికి **'యువా స్యాత్సాధు యువాఽ ధ్యాయకః** – యవ్వనవంతుడు, సౌశీల్యవంతుడు, విద్యావంతుడు' అయి ఉండాలని తైత్తిరీయోపనిషత్తు మూడు లక్షణాలు పేర్కొంది.

శరీరం క్షీణించి, అనారోగ్యంతో ఉన్నవాడు ఆనందంగా ఉండలేడు. అందుకే ఆనందంగా ఉండడానికి దృఢంగా, బలంగా, ఆరోగ్యవంతంగా ఉండే యువప్రాయం మొదటి అర్హత. ఈ తరం యువతలో శరీర ఆరోగ్యంపై ఓ అవగాహన ఉంది. అందుకే వ్యాయామం, యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో తగిన జాగ్రత్తలను తీసుకుంటున్నారు. అలాగే, ఉన్నత విద్యలను అభ్యసించి, ఉన్నతోద్యోగాలను సంపాదించి ధనార్జన చేయడంలో కూడా సఫలీకృతులవుతున్నారు.

ఆనందంగా ఉండడానికి కేవలం ఆరోగ్యం, విద్య ఉంటే సరిపోదు. ఈ రెండింటినీ అనుసంధానం చేసే 'సౌశీల్యం' ముఖ్యమైన అర్హత. అందుకే క్రమశిక్షణ, మనోనియంత్రణ, నైతిక విలువలు ముఖ్యమని మన ఋషులు వేల సంవత్సరాల క్రితమే తేటపరిచారు. కానీ నేడు మనమంతా భారత, భాగవత, రామాయణ, ఉపనిషత్తుల్లో అనంత జ్ఞాననిధి నిక్షిప్తమై ఉందని తెలియక, పాశ్చాత్యులు మన భారతీయ సాహిత్యం నుండి సేకరించి రాసిన వ్యక్తిత్వవికాస పుస్తకాలను చదువుతూ సంబరపడుతున్నాం. దీనికంతటికీ కారణం మన ఆధ్యాత్మిక గ్రంథాలు కేవలం ఆత్మసాక్షాత్కారం గురించి బోధిస్తాయేగానీ; వ్యక్తిత్వవికాసం గురించి తెలియజేయవనే భ్రమలో ఉండడమే!

నిజానికి, కాలేకడుపుల్లో ఆధ్యాత్మిక బోధ జీర్ణం కాదు; కన్నీటి బ్రతుకుల్లో ఆత్మతత్త్వం అంకురించదు. ఈ లోకంలో ఆనందంగా జీవించిన వ్యక్తే అంచెలంచెలుగా ఆధ్యాత్మిక సారాన్ని గ్రహించి, ఆత్మానందాన్ని పొందే అర్హతను సాధించగలుగుతాడు. అందుకే తైత్తిరీయోపనిషత్తు – 'శారీరకబలం, బుద్ధిబలం, నైతికబలం ఉన్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఆనందాన్ని పొందుతాడు. ఆ తరువాత గంధర్వలోకం నుండి బ్రహ్మలోకం వైపు పురోగమించేకొద్దీ వంద రెట్లు ఆనందం అధికమవుతూ ఉంటుంది'అని వివరించింది.

ఆరోగ్యం, విద్య, సౌశీల్యం గల వ్యక్తి ఆనందంగా జీవించగలడని మన ఋషులు సూచించారు. అయితే, నేడు ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా కేంద్రాలున్నాయి, విద్యార్జన కోసం విద్యాలయాలున్నాయి, మరి సౌశీల్యం కోసం శిక్షణా కేంద్రాలు ఎక్కడున్నాయి? నైతిక విలువల్ని బోధించేవారెవరు?

అందుకు సాక్షాత్తూ ఆ భగవంతుడే నిర్మల ప్రేమను పంచడానికి తల్లిగా; పరిరక్షణ కోసం తండ్రిగా, జ్ఞానాన్ని బోధించడానికి గురువుగా ఈ భువిలో వెలశాడు. అందుకే ఉపనిషత్తులు 'మాతృ దేవో భవ, పితృ దేవో భవ, ఆచార్య దేవో భవ' అంటూ భువిలో వెలసిన త్రిమూర్తులను స్తుతించాయి. కాబట్టి ఆ భగవంతుని ప్రతిరూపాలైన తల్లి, తండ్రి, గురువులే పిల్లల శీలనిర్మాణంలో ప్రధాన పాత్రధారులు.

**చిరుప్రాయంలో చెరగని ముద్ర :** చిరుప్రాయంలో తల్లి ఇచ్చే శిక్షణా విధానం పిల్లల భవిష్యత్ జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న విషయంపై కొన్నేళ్ళ క్రితం ఓ సర్వే జరిగింది. ఆ సర్వేలో వెల్లడైన విషయం ఇది:

ఓ తల్లి పిల్లవాడికి నడక నేర్పే ప్రయత్నంలో పిల్లవాడికి కొంత దూరంలో నిలబడి తన వైపు రమ్మని ప్రోత్సహిస్తుంది. అప్పుడు పిల్లవాడు తల్లిని చేరుకోవాలని ఆశతో ముందుకు నడవడానికి ప్రయత్నించాడు. ఈ ప్రక్రియలో పిల్లవాడు అదుపుతప్పి పడిపోయి, ఏడవడం ప్రారంభించాడు. వెంటనే తల్లి పరుగున వెళ్ళి పిల్లవాణ్ణి ఓదారుస్తూ 'ఛీ, పాడు నేల! నీ వల్లే మా పిల్లాడికి దెబ్బలు తగిలాయ'ంటూ నేలను కొట్టింది. అప్పుడు పిల్లవాడు వెంటనే ఏడుపు ఆపేశాడు.

ఇదే విధంగా మరో తల్లి తన పిల్లవాడికి నడక నేర్పేటప్పుడు, ఆ పిల్లవాడు తల్లి వైపు నడుస్తూ వస్తుండగా పడిపోయాడు. అప్పుడు ఆమె పిల్లవాడి దగ్గరకు వెళ్ళకుండా దూరం నుండే 'లే నాయనా! లే లేచిరా!' అంటూ ఉత్సాహపరిచింది. ఆ పిల్లవాడు మెల్లగా లేచి నడుచుకుంటూ తల్లిని చేరుకున్నాడు. ఈ ఇద్దరు పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత వారి స్వభావాన్ని పరిశీలిస్తే తేలిందేమిటంటే, మొదటి పిల్లవాడు తనకు ఎదురైన కష్టాలకు, అపజయాలకు బయట పరిస్థితులు, పరిసరాలు, వ్యక్తులే కారణమని నిందించే స్వభావం కలవాడయ్యాడు. రెండవ పిల్లవాడు తనకు ఎదురైన కష్టాలు, అపజయాలను ఎదుర్కోగల మనోబలసంపన్నుడయ్యాడు.

**శీలనిర్మాణంలో తల్లి పాత్ర:** నిజానికి పిల్లల శీలనిర్మాణ ప్రక్రియ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే ప్రారంభమవుతుంది. పిల్లవాడు గర్భంలో ఉన్నప్పుడే తల్లి తినే ఆహారం, వినే విషయాలు, చూసే దృశ్యాల ప్రభావం పుట్టబోయే బిడ్డపై ఉంటుంది. కాబట్టి పిల్లల శీలనిర్మాణానికి ఆద్యురాలు తల్లి. ఈ సత్యాన్ని ఋజువు చేసే ఎన్నో సంఘటనలు మన పురాణ, ఇతిహాసాల్లో ఉన్నాయి.



అందుకే పిల్లల శీలనిర్మాణంలో తల్లి పాత్ర అత్యంత ప్రధానమైనది. తల్లి పిల్లలకు చిరుప్రాయంలో ఇచ్చిన శిక్షణ ప్రభావం ఏవిధంగా ఉంటుందో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జీవితమే నిదర్శనం. కలకత్తా సమీపంలో ఉన్న వీర్‌సింఘ్ అనే గ్రామంలో ఈశ్వరచంద్ర జన్మించాడు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ తల్లి కష్టపడి అతడికి విద్యాబుద్ధులను నేర్పించింది.

ఈశ్వరచంద్ర ప్రయోజకుడు అయిన తరువాత ఒకసారి తల్లి వద్దకు వెళ్ళి 'అమ్మా! నీకు బంగారు నగలు చేయిస్తాను' అని చెప్పాడు. అందుకు ఆమె 'మన గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, వైద్యశాలను ప్రారంభించు, నువ్వు సౌశీల్యవంతుడిగా జీవించు – ఇవే నువ్వు నాకు ఇవ్వాల్సిన ఆభరణాలు' అని చెప్పింది. సద్గుణరాశి అయిన తల్లి మాటలు విద్యాసాగర్ హృదయాన్ని కదిలించాయి.

విద్యాసాగర్ కాలాంతరంలో 'విద్య కేవలం పొట్టకూటి కోసమే కాదు. నైతిక విలువలను పెంచేదే నిజమైన విద్య. నైతిక విలువల్ని విస్మరించొద్దు' అని బాల్యంలో తల్లి చెప్పిన మాటలే తనపై ప్రభావం చూపాయని గుర్తుచేసుకునేవారు. విద్యాసాగర్ గొప్ప విద్యావేత్తగా, ధార్మికవేత్తగా, సంఘసంస్కర్తగా ప్రసిద్ధిగాంచారు.

**శీలనిర్మాణంలో తండ్రి పాత్ర:** పిల్లల శీలనిర్మాణంలో తల్లి తరువాత తండ్రి పాత్ర ముఖ్యమైనది. తండ్రి పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయాన్ని గడపడానికి ప్రయత్నించాలి. అప్పుడు పిల్లల లోటుపాట్లను తెలుసుకొని ఎప్పటికప్పుడు వారిని సరిదిద్దే అవకాశం ఉంటుంది. వారి అలవాట్లు పొరపాట్లుగా మారకుండా జాగ్రత్తలు తీసుకొనే వీలుంటుంది. అందుకు బెంజమిన్ ఫ్రాంక్లిన్ జీవితం నిదర్శనం.

ఫ్రాంక్లిన్ తండ్రి కొవ్వొత్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పేదరికం వల్ల కష్టాలను అనుభవిస్తున్న కుటుంబానికి చేదోడుగా ఉండాలనుకున్నాడు ఫ్రాంక్లిన్. అతడు ఒకసారి చేపలు పట్టడానికి చెరువుకు వెళ్ళాడు. చేపలు పట్టడానికి వీలుగా ఉంటుందని అక్కడ ఒక గట్టు కట్టాలనుకున్నాడు. అందుకు ఇతర స్నేహితులతో కలిసి ఒక ఇంట్లో ఉన్న రాళ్ళను దొంగిలించి చెరువు దగ్గర గట్టు కట్టాడు. అప్పటి నుండి చేపలను వేటాడడం సులభమైంది. ఫ్రాంక్లిన్ వేటాడిన చేపలను తెచ్చి తండ్రికి ఇచ్చేవాడు.

ఫ్రాంక్లిన్ చేసిన దొంగతనం గురించి తెలిసిన తండ్రి అతణ్ణి మందలిస్తూ 'అబద్ధం, దొంగతనం, మోసం ద్వారా సంపాదించినది ఏదైనా విషతుల్యమే! ఆకలితో మరణించినా ఫరవాలేదుగానీ మోసపూరితమైన పనులు ఎన్నడూ చేయవద్దు' అని కుమారుడి తప్పును సరిదిద్దాడు. అప్పటి నుండి ఫ్రాంక్లిన్ చేపల వేటను మానేశాడు. లండన్ వెళ్ళి అక్కడ ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేయడం ప్రారంభించాడు. క్రమశిక్షణ, నిజాయతీ, నిబద్ధతలతో శ్రమించిన ఫ్రాంక్లిన్ కొన్నాళ్ళకు స్వయంగా ముద్రణాలయాన్ని ప్రారంభించాడు. తరువాత గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగాడు. కాలాంతరంలో అమెరికా దేశపు ఉత్తమ నాయకుల్లో ఒకడిగా ప్రసిద్ధిగాంచాడు.

**శీలనిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర:** విద్యార్థులను శీలవంతులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనది. ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ బోధల్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో కూడా చూపించాలి. అప్పుడే విద్యార్థుల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోగలుగుతారు. అందుకు ఉదాహరణగా సోక్రటీస్‌ను చెప్పవచ్చు. సోక్రటీస్ తన శిష్యులకు 'ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా సమత్వాన్ని కోల్పోకూడదు, నిజాయతీగా జీవించాలి'అని బోధించేవారు.

సోక్రటీస్ తాను కొద్ది క్షణాలలో మరణించబోతున్నానని తెలిసినప్పుడు కూడా ఆయన ముఖంపై విషాదఛాయలు కనిపించలేదు. పైగా అలాంటి పరిస్థితుల్లోనూ ఒక శిష్యుణ్ణి పిలిచి 'నేను ఫలానా వ్యక్తికి కొంత సొమ్ము బాకీ ఉన్నాను; నువ్వు ఆ అప్పును తీర్చి, నిజాయతీకి భంగం వాటిల్లకుండా చూడు' అని చెప్పారు. గురువు తమకు బోధించిన సమత్వాన్నీ, నిజాయతీనీ మరణ సమయంలో కూడా ఆచరించి చూపినందుకు ఆ శిష్యులు ఎంతగా ప్రభావితులయ్యారో వేరే చెప్పనవసరం లేదు.

అందువల్ల త్రిమూర్తుల ప్రతిరూపాలుగా ఈ భువిపై వెలసిన తల్లి, తండ్రి, గురువులు పిల్లల శీలనిర్మాణానికి ఆద్యులమనీ, సుగుణాలయానికి ఆచార్యులమనీ గ్రహించి భావితరాలకు మార్గదర్శకులుగా మెలగాలి. అప్పుడే ఋషి వాక్కులను నిజం చేసినవారవుతారు. దేశానికి ఉత్తమ పౌరులను అందించినవారవుతారు. ❖

**తల్లి కుటుంబానికి మూలకేంద్రం, ఆదర్శమూర్తి. తల్లి ప్రేమ కన్నా ఏ ప్రేమ ఈ సృష్టిలో భగవంతుని ప్రేమకు ప్రతిరూపంగా ఉండగలదు? అందువల్ల తల్లి సాక్షాత్తూ భగవదవతారం.** - స్వామి వివేకానంద

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Ramakrishna+Prabha+June+2015**

* * *